
# మోహనరావు - మొబైల్ స్కూలు

జ్యోత్స్న

**కాన్వెంట్ నుంచి ఇంజనీరింగ్ వరకూ విద్యా వ్యవస్థ వ్యాపారంగా మారి పోయింది. డబ్బుకోసం తాపత్రయమే తప్ప పిల్లలకి సరైన సౌకర్యాలు అందించాలనే కోరిక ఏమాత్రం లేని దారుణమైన వ్యాపారులు విద్యా వ్యవస్థలోకి ప్రవేశించారు. ఈ రెండు కథలు మన ఎడ్యుకేషన్ సిస్టంలోని డొల్లతనాన్ని వ్యంగ్యంగా మన కళ్ళముందుంచుతున్నాయి.**

మోహనరావు ఒక ఉపాధ్యాయుడు. పదేళ్లనుండీ రకరకాల పాఠశాలల్లో పనిచేసి సంపాదించుకొన్న అనుభవంతో ఒక కొత్త ఆలోచన వచ్చింది. 'తానే ఒక పాఠశాలని ప్రారంభిస్తే?' అనే ఆలోచన రావడమే తడవుగా తోటి ఉపాధ్యాయులను, పాత స్నేహితులను అందరినీ సమావేశపరచి చెప్పాడు మోహనరావు. ఇన్నాళ్ల నుండీ ఎవరో ఒకరి చేతి కింద అణిగి మణిగి పనిచేసి విసుగెత్తిన ఉపాధ్యాయులు అందరికీ ఈ ఆలోచన నచ్చింది. వాళ్లకి మోహనరావు బాగాతెలుసు. చాలాకీగా, తన మంచి తనంతో అందరినీ కలుపుకు పోయే తత్వం,సమర్థత, కాస్తంత సాహసం ఉన్న మోహనరావుని నమ్ముకుంటే నష్టపోయేదేం లేదన్పించింది వారికి. అంతేకాక ఈ పాఠశాల ద్వారా తమకూ కాస్త గుర్తింపు లభిస్తుందని అనుకొన్నారు వాళ్లు. అయితే, 'ఆ పాఠశాల ఎలా ఉండాలి?' అన్న విషయంపై చర్చలు జరిపారు.

"ఏదైనా సరే, ఆ పాఠశాల అందరినీ ఆకర్షించేలా వినూత్నంగా ఉండాలి. అప్పుడే మిగిలిన పాఠశాలల పోటీని తట్టుకొని, ఈ రంగంలో నిలబడగలం.' అనే ఏకాభిప్రాయానికి వచ్చారు. కానీ తాము ప్రారంభించబోయే పాఠశాలను 'ఏ పద్ధతిలో నడిపితే నవ్యంగా ఉంటుంది?' అని అందరూ చాలాసేపు తలలు బద్దలు కొట్టుకొని మరీ ఆలోచించారు. తలనొప్పి అయితే వచ్చింది కానీ ప్రయోజనమేమీ కన్పించలేదు. ఆ తలనొప్పి తగ్గించుకోవటానికి దగ్గరలో ఉన్న కాఫీ హోటల్‌కు వెళ్లి చిక్కటి బ్రూ కాఫీ త్రాగి, మళ్లీ ఆలోచించటం మొదలు పెట్టారు. ఉన్నట్టుండి మోహనరావు తన కుర్చీలో నుండి ఒక్క ఉదుటన లేచి, "మొబైల్ స్కూలు, మొబైల్ స్కూలు" అని ఆనందంగా అరుస్తూ ముందున్న బల్లమీద గట్టిగా గుద్దాడు. ఆ కుదుపుకి కాఫీ కప్పులన్నీ ఒకదానికొకటి తగిలి చప్పుడయ్యాయి. ఆ అరుపులకీ, చప్పుడుకీ ఏమైందోనని కంగారుపడుతూ హోటల్లోని జనమంతా మోహనరావుకేసి చూసారు. మిగిలిన స్నేహితులంతా అతన్ని శాంతపర్చి కుర్చీలో కూర్చోపెట్టి, 'నీ ఆనందానికి కారణమేమిటో ఇప్పుడు చెప్పు.' అన్నట్లుగా అతని వైపు చూసారు. "నాకో మంచి ఆలోచన వచ్చింది. మనం ప్రారంభించబోయే పాఠశాలొక మొబైల్ స్కూలు..." అంటూ మోహనరావు చెబుతుండగానే మొబైల్ స్కూలా? అదేమిటి?" అని అందరూ కోరస్‌గా అరిచారు.



"ఆగండాగండి. కంగారు పడ

కండి. చెబుతున్నాగా, ఇంతవరకు మనం అనేక రకాల స్కూళ్ల పేర్లు విన్నాం. మోడల్‌స్కూల్, గ్లోబల్ స్కూలు.. ఇలా, అవునా?''

''అవునవును.'' అంటూ అందరూ ఉత్సాహంగా ముందుకు వంగి వింటున్నారు. మోహనరావు తన ఆలోచనలను వివరించటం మొదలుపెట్టాడు.

''ఇదొక వినూత్న ప్రయోగం. విద్యార్థులు స్కూలుకి రారు. మనమే విద్యార్థుల దగ్గరికి వెళతాం.''

''అదెలాగ'' అందరిలో కుతూహలం.

''మీలో చాలామంది మొబైల్ లైబ్రరీ, మొబైల్ హాస్పిటల్ అన్నవాటిని వినే ఉంటారు'' అని మోహనరావు అనగానే, 'అవును, మొబైల్ లైబ్రరీ అంటే 'సంచార గ్రంథాలయం'. మా చిన్నతనంలో అయిదారుల అరలు వున్న ఒకతోపుడు బండిలో పుస్తకాలు పెట్టుకొని ఇంటింటికీ తీసుకొనివచ్చి కావలసినవారికి ఇచ్చేవారు. ''నలుగురైదుగురు ఉత్సాహంగా అన్నారు. ''పూర్వం వైద్యసదుపాయాల్లేని పల్లెటూళ్లకు డాక్టర్లు వారానికోరోజు వ్యాన్‌లో వచ్చి వైద్య పరీక్షలు జరిపి కావలసిన మందులు ఇచ్చి వెళుతుండేవారు.'' అని మరొకరు అన్నారు.

> **''అదేందో, మా యిస్కూలు పేరేందో నాకు తెలవదు గానబ్బాయా, ఇదిగో మా పిల్లగాణ్ణి మల్లెపూవులాగా పెంచినా, వాడి ఒంటి మీద దెబ్బ పడిందంటే మరి మంచిగుండదబ్బాయ్, నువ్వెట్లా సదువు సెప్తావో గాని, మంచి మార్కులు రావాల, అందుకే గంద పెసలు కట్టిన మల్ల ఇంటికే యిస్కూలు వస్తదని బిడ్డను జేర్చిన?''**

''యస్., కరెక్ట్. సరిగ్గా అదే, దానిని గూర్చే నేను చెప్పేది. వాళ్ళేవిధంగా పుస్తకాలను, డాక్టర్లను మన దగ్గరకు తీసుకొని వచ్చేవారో అలాగే మనం కూడా ఉపాధ్యాయులను విద్యార్థుల వద్దకు తీసుకొని వెళతాము. పాఠశాలలో ఉండే సదుపాయాలన్నింటినీ ఒక వ్యాన్‌లో సమకూర్చుకొని వెళతాము. బ్లాక్‌బోర్డు, చాక్‌పీసులు, డస్టర్లు, కంప్యూటర్లు, విద్యార్థులు కూర్చోవటానికి వీలుగా ఏర్పాట్లు ఉంటాయి. ఒకో సబ్జెక్టుకు ఒక్కో టీచరు ఉంటారు. కంప్యూటర్ టీచరు, సంగీతం టీచరు కూడా ఉంటారు. మనం ఒక్కొక్క కాలనీ మధ్యలో వ్యాన్స్ ఆపుతాం. ఆ కాలనీలో ఉన్న, మన స్కూలులో చదివే పిల్లలంతా వచ్చి వ్యాన్‌లో కూర్చుని పాఠాలు నేర్చుకొని వెళుతుంటారు. ఇంకొక విషయం మనం ముందుగా ఎల్.కె.జి.నుండి ఐదవతరగతి వరకు ఉండే ప్రాథమిక పాఠశాలను ప్రారంభిద్దాం. ఈ ప్రయోగంలో కనుక మనం సఫలీకృతులమైతే మాధ్యమికోన్నత తరగతుల గూర్చి ఆలోచించవచ్చు'' అన్నాడు మోహనరావు. 'సరే, ఇదేదో కొత్తగా, బాగానే ఉందే, అలాగే చేద్దాం' అనుకొన్నారందరూ. అయితే, 'ఆ పాఠశాలకు పేరేం పెట్టాలి?' అన్న విషయంపై తర్జన భర్జనలు జరిపారు. చివరికి, ఆ పాఠశాలను ప్రారంభించే ఉద్దేశ్యం, పెట్టుబడి కూడా మోహనరావువే కనుక అతని పేరు పెడితేనే బాగుంటుందనుకొని అందరూ దానికి 'మోహనరావు మొబైల్ స్కూలు' అనేపేరును ఖాయం చేసారు. మర్నాడు ఉదయం న్యూస్‌పేపర్‌తో పాటు, స్కూలు పేరు, దాని లక్ష్యాలు వివరిస్తూ బ్రోచర్స్‌ను పంచిపెట్టారు. తాము ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభకు రమ్మని ఆహ్వానించారు. సభ ఉదయం పదకొండు గంటలకు ప్రారంభం అవుతుందని బ్రోచర్‌లో ఇచ్చినా, పది గంటలకే ఆవరణంతా జనంతో నిండిపోయింది. అది చూసి మోహనరావు బృందం ఆనందంతో తలమునకలయ్యారు. అందరూ కలిసి మోహనరావును వేదికమీదకు ఎక్కించి మాట్లాడమన్నారు.

''సభకు నమస్కారం. మా ఆహ్వానాన్ని మన్నించి, మేము చెప్పిన సమయాని కంటే ముందుగానే వచ్చి, మాలో నూతనోత్సాహాన్ని రేకిత్తిస్తున్న జనవాహినికి మా కృతజ్ఞతలు. ఇంత ఉత్సాహంగానూ ఈ కొత్త ప్రయోగానికి చేయూతనివ్వవలసిందిగా కోరుతున్నాను.'' అని మోహనరావు అనగానే ఆవరణంతా హర్షధ్వానాలతో మారు మ్రోగింది. తరువాత అతడు తమ స్కూలు ప్రత్యేకతను, దాని నిర్వహణావిధానాన్ని వివరించాడు. వాళ్లకి ఈ పద్ధతేదో బాగానే ఉన్నట్లు అన్పించింది. పిల్లల్ని కష్టపడి తెమిల్చి, యూనిఫామ్, షూస్ వేసి సమయానికి స్కూల్‌కి పంపవలసిన అవసరం లేదు. ఆటోలు, బస్సుల గోల లేదు. ముఖ్యంగా బండెడు పుస్తకాలు వీపు మీద మోయవలసిన అవసరం లేదు. పైగా వారికి కావల్సిన చదువు ఉపాధ్యాయులే ఇళ్ళ దగ్గరకొచ్చి చెపుతామంటున్నారు. ఇంతకంటె ఇంకేం కావాలి? . ఈ విధంగా ఆలోచించిన తల్లిదండ్రులందరూ అప్లికేషన్లు తీసుకొని ఫీజులు చెల్లించటం ప్రారంభించారు. మోహనరావు విద్యార్థుల సంఖ్యను బట్టి వ్యానులు సిద్ధం చేయించాడు.

ఇక, అప్పటినుండి అసలైన కథ మొదలైంది. ఓ సుముహూర్తాన వ్యానులు తమకు ఇచ్చిన చిరునామాల ప్రకారం విద్యార్థుల ఇళ్లను వెతుక్కుంటూ బయలుదేరాయి. పద్మాకాలనీలోకి ప్రవేశించిందొక వ్యాను. కాలనీ మధ్యలో వ్యాన్‌ని ఆపారు. ఒక్కో టీచరు ఒక్కోఅడ్రసు తీసుకొని విద్యార్థులను తీసుకొని రావటానికి బయలుదేరారు. పన్నెండవ నెంబరు ఫ్లాట్ దగ్గరకు వెళ్లాడు సుబ్బారావు. తలుపువేసి ఉంది. కాలింగ్ బెల్ కొట్టిన ఐదు నిముషాలకు తలుపు తెరుచుకుంది.

''పి. సాయికుమార్, నాలగవతరగతి, ఇల్లు ఇదేనా?'' అని ఇంకా ఏదో అడగబోతూ ఆ ఇంటావిడ ముఖం చూసి ఆగిపోయాడు సుబ్బారావు. ఏభై ఏళ్ల వయసు ఉంటుంది ఆవిడకి. నల్లగా, పొట్టిగా, లావుగా, గుమ్మటంలా ఉన్న ఆవిడ చిరచిరలాడుతూ, ఇంకేదైనా అడిగితే కొట్టేటట్లు కన్పించింది.

''ఏమిటి నసుగుడు? కావల్సినదేదో తొందరగా చెప్పి ఏడు. అవతల టి.విలో మంచి సీరిమల్ వస్తుంటే నీ గొడవేమిటి?'' ఆవిడ రూపాన్ని చూస్తేనే గుండెల్లో దడపుట్టిన సుబ్బారావు కరుకైన ఆ గొంతు వినగానే బిక్కచచ్చిపోయాడు.

ఎలాగో తేరుకుని 'అబ్బెబ్బే... ఏం లేదు. నేను మోహనరావు మొబైల్ స్కూలు టీచర్‌ని....' అంటుంటేనే ''ఏమిటీ! నువ్వు టీచరువా? అసలు పిల్లలెవరైనా భయపడాతారా నిన్ను చూసి? (పాపం! మన సుబ్బారావేమో సన్నగా, బక్కపల్చగా గట్టిగా గాలేస్తే ఎగిరిపోయేటట్లు ఉంటాడు) ఓహో! వ్యాన్ వచ్చి తగలడిన ట్లుంది, సర్లే. ఇదిగో తీసుకెళ్లు'' అంటూ ఓ పదేళ్ల కుర్రాడిని రెక్క పట్టుకొని బరబరా లాక్కొచ్చి అతని ముందు పడేసింది. ఆ వెనుకే ఓ పుస్తకాల సంచీ కూడా గిరవాటు వేసి తలుపు ధడాల్న మూసుకొంది. పాలిపోయిన ముఖంతో సుబ్బారావు ఆ పిల్లవాడిని వెంటేసుకొని వ్యాన్ దగ్గరకు బయలుదేరాడు. తల్లి తోసిన తోపుకు చెదరిపోయిన జుట్టుని, జారిపోతున్న నిక్కరుని సర్దుకుంటూ పుస్తకాల సంచీ తగిలించుకొని సదరు సాయికుమార్ సుబ్బారావు వెనకాలే నడవసాగాడు.

రామారావు తొమ్మిదో నెంబరు ఫ్లాట్‌కి వెళ్లాడు. పిల్లలంతా ఇంటి ముందు ఆడుకుంటున్నారు.''మోహన్రావు మొబైల్ స్కూల్లో ఎల్.కె.జి. చదువుతున్న ఎస్ భరత్ నువ్వేనా?'' అని ఫ్లాట్ ముందు ఆడుకొంటున్న చిన్నపిల్లాడిని అడిగాడు రామారావు. వాడేదో మాట్లాడబోతుంటే, ''అవునవును వీడే!'' అంటూ వాడిని ముందుకు తోసాడు. ఇంకో పిల్లాడు.. వాడు కాళ్లు చేతులు గింజుకుంటూ, ఏడుస్తూ, గొడవ గొడవగా ఏదో అంటున్నా విన్పించుకోకుండా, ''చిన్న పిల్లలు స్కూలుకి రావటానికి ఇలాగే ఏడుస్తారులే.'' అనుకొని వాడిని గబగబా లాక్కెళ్లి వ్యాన్‌లో కూలేసాడు రామారావు.

''అదేందో, మా యిస్కూలు పేరేందో నాకు తెలవదుగానబ్బాయా, ఇదిగో మా పిల్లగాణ్ణి మల్లెపూవులాగా పెంచినా, వాడి ఒంటి మీద దెబ్బ పడిందంటే మరి మంచిగుండదబ్బాయ్, నువ్వెట్లా సదువు సెప్తావో గాని, మంచి మార్కులు రావాల, అందుకే గంద పైసలు కట్టిన మల్ల ఇంటికే యిస్కూలు వస్తదని బిడ్డను జేర్చిన?'' అంటూ, ఇరవై నెంబరు ఫ్లాట్‌కెళ్లిన అప్పారావును చూసి గుమ్మలోనే దండకం చదివాడు ఓ ఆసామి. అతడు ఖద్దరు పంచె, లాల్చీ ధరించి, తలపైన తెల్ల టోపీ పెట్టుకొని రాజకీయ నాయకుడిలా ఉన్నాడు.

పదిగంటలకల్లా వ్యానంతా పిల్లలతో నిండిపోయింది. అంతా చిన్నపిల్లలే కావడం వల్ల గోలగా హడావిడిగా ఉంది. కొంతమంది సిసింద్రీలు వ్యాన్‌లో ఉన్న బోధనా పరికరాలన్నీ ముట్టుకొని అటు తిప్పి, ఇటుతిప్పి పరీక్షలు చేసేస్తున్నారు. ఎల్.కె.జి, యుకెజి పిల్లలయితే బాగా ఏడుస్తున్నారు. ''శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తిగానరసమే ఫణిః'' అన్న ఆర్యోక్తి ఉండనే ఉంది కదా, ముందుగా మ్యూజిక్ పిరియడ్ తీసుకుంటే, 'పిల్లలు ఆ సంగీతం విని ఏడుపు మానేస్తారు. ఆ వాతావరణానికి అలవాటు పడతారు.' అనే సదుద్దేశ్యంతో సంగీతం టీచరుని పిల్చి పిల్లలకి పాటలు నేర్పించమన్నాడు మోహనరావు. సంగీతం మాష్టారు తన సబ్జెక్టుకి తగ్గట్లే పంచె, లాల్చీతో సంప్రదాయబద్ధంగా కన్పించేసరికి ఏతాతయ్యనో చూసిన భావం కలిగి, చాలామంది పిల్లలు గోలమానేసారు. తాను నోరు విప్పకముందే, వాళ్లు నోళ్లు మూసెయ్యటం చూసిన మాష్టారుకి కించిత్తు గర్వం కూడా కల్గింది. చిన్నపిల్లలు కదా ఓం ప్రథమంగా లాలిపాట పాడితే బాగుంటుంది అనుకొని, ''రామాలాలీ, నీలమేఘశ్యామాలాలీ..'' అంటూ ప్రారంభించి తన పాటకు తానే తన్మయత్వం చెందుతూ, చేత్తో తాళం వేస్తూ, కళ్లు మూసుకొని పాడసాగాడు. పాట పూర్తయ్యాక ఆ పారవశ్యం నుండి తేరుకొని కళ్లు తెరచి

చూస్తే ఏముంది? చాలామంది పిల్లలు కుర్చీల్లో వాలి శుభ్రంగా నిద్రపోతున్నారు. కొంతమంది పిల్లలు బొటనవేలు నోట్లో వేసుకొని చీకుతూ మాష్టారికేసి చిద్విలాసంగా చూస్తున్నారు. సంగీతం మాష్టారు తన గాన మహిమకు ఉప్పొంగిపోతూ, ''ఏమోయ్, మోహన్రావు ఏమైందోనని పరుగెత్తుకొచ్చాడు. ''చూసావుటోయ్, నా గానశక్తి! పిల్లలు ఎలా నిద్రపోతున్నారో?'' అనగానే మోహన్రావు కోపంగా, ''తెల్లారినట్లుంది మీ తెలివి, చదువుకోవల్సిన పిల్లలు మొదటి పిరియడే నిద్రపోతే ఎలా? లేపండి వాళ్లని.'' అని గట్టిగా అరిచాడు.

''ఎలాగయ్యా నిద్ర బుచ్చుటాన్కి లాలిపాటలు పాడతారని తెల్సుగానీ, లేపటానికి ఏరాగం పాడతారో నాకు తెలియదే?'' అన్నాడు సంగీతం మాష్టారు. తన ప్రతిభను మోహనరావు సరిగ్గా గుర్తించలేదన్న విచారంతో.

''ఆరున్నొక్కరాగం పాడి అఘోరిస్తేసరి!'' అన్నాడు చిర్రెత్తిన మోహనరావు.

''ఎంత ప్రిన్సిపాలు అయితే మటుకు? పెద్దవాడిననే గౌరవం లేకుండా అంత చులకనగా మాట్లాడ్డం ఏంటి?' అన్న కోపంతో అక్కడున్న వాటర్ బాటిల్స్ మూతలు తెరిచి వాటిల్లో నీళ్లు పిల్లల ముఖాలపై కుమ్మరించాడు ఆయన.

''చేసిన నిర్వాకం చాలు గానీ, ఇప్పుడు గణితోపాధ్యాయుడిని పిలవండి. పిల్లలు కాస్త జాగ్రదావస్థలోకి వస్తారు.'' అన్నాడు మోహన్రావు. మ్యాథ్స్‌టీచరు కామేశం వచ్చాడు. పిల్లల చేత ఎక్కాలు వల్లె వేయించాక, ఇప్పుడు నేనొక తమాషా ప్రశ్న అడుగుతాను జవాబు చెప్పండి'' అన్నాడు పిల్లలంతా ఉత్సాహంగా ''ఓ'' అన్నారు కోరస్‌గా. తడిపిన చొక్కాలు ఎండలో ఆరేస్తే ఒక్కొక్కటి పదినిముషాల్లో ఆరుతాయి. ఆరుచొక్కాలు ఎన్నినిముషాల్లో ఆరతాయి? అన్నాడు కామేశం.

''ఎప్పటికీ ఆరవు సార్.'' అన్నాడొకడు.

''ఏం, ఎందుకు?'' అన్నాడు ఆశ్చర్యంగా కామేశం.

''ఇలా తలుపులన్నీ వేసేస్తే ఎలా ఆరతాయి సర్. చలేసి ఒణుకుతున్నాం'' అన్నాడు ఒక చిచ్చరపిడుగు. సంగీతం మాష్టారు పోసిన నీళ్లతో తడిసిన బట్టలని చూపిస్తూ.

''ఓహో! నిజమే సుమా.'' అనుకుంటూ కామేశం వ్యాన్ విండోషట్టర్స్ దించాడు.

''ఊం, తెరవవయ్యా తలుపు, స్కూలు పేరు చెప్పి పిల్లల్ని కిడ్నాప్ చేసి తీసుకెళ్లి పోదామని అనుకుంటున్నారా? జాగ్రత్త! పోలీసు రిపోర్టు ఇస్తాను.'' అంటూ బయట మోహన్రావు మీద విరుచుకుపడుతున్న ఒక పెద్దమనిషి కన్పించాడు కామేశానికి.

'ఏమిటీ గొడవ?' అనుకుంటూ కామేశం వ్యాన్ లోనుండి దిగే లోగానే, ఆ పెద్ద మనిషి

వ్యాన్‌డోర్ తీసి తల లోపలికి పెట్టి, ''బత్తూ.. ఒరేయ్ బత్తు నాన్నా ఎక్కడున్నావురా? నిన్నేం చేస్తున్నార్రా వీళ్లు.''అంటూ కొంపలు మునిగిపోతున్నట్లు అరిచాడు. ఆ అరుపువిన్న ఓ ఎల్.కె.జి. కుర్రాడు కామేశాన్ని నెట్టుకుంటూ వ్యాన్ దిగేసాడు. ''నాన్నా, మరేమో నేను భరత్‌ని కాదని చెబుతున్నా వినకుండా ఈయన నన్ను లాక్కొచ్చి వ్యాన్‌లో పడేసాడు.'' అని రామారావును చూపిస్తూ చెప్పాడు ఆ కుర్రాడు.

''ఏమయ్యా! మీ స్కూల్లో చదువుతున్నాడో లేదో తెల్సుకోకుండా కనబడ్డ పిల్లాడినల్లా తీసుకొచ్చి దీంట్లో పెట్టి తలుపులేసేయటమేనా?'' చిందులు తొక్కాడా పెద్దమనిషి రామారావును చూస్తూ. రామారావుకప్పుడు తను చేసిన పొరపాటు తెలిసొచ్చి కిమ్మనకుండా ఊరుకున్నాడు. పరిస్థితి అర్థమైన మోహనరావు. అతనికి సర్దిచెప్పబోయాడు.

''జాగ్రత్త! నేనేంటో మీకు తెలియదులా ఉంది. ఇంకెప్పుడైనా ఇలా జరగాలీ, ఒక్కొక్కడినీ కటకటాల్లో తోయించి ఊచలు లెక్కబెట్టిస్తా.'' అని హుంకరిస్తూ వెళ్లాడా పెద్దమనిషి.

'బతుకు జీవుడా!' అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నారు ఉపాధ్యాయులంతా. ఈ గొడవకి ఆ చుట్టుప్రక్కల ఇళ్లలో జనమంతా తలుపులు తీసుకొని బయటకు వచ్చి చూడసాగారు. కొంచెం దూరంగా ఉన్న వాళ్లు డాబాలెక్కి ఆ వ్యాన్‌ని, దానిముందు నిలబడ్డ టీచర్లని చూసి గుసగుసలాడుకుంటూ నవ్వుకోసాగారు.

మోహనరావు బృందం పాట్లన్నీ చూస్తున్న ఒకాయన మోహనరావు దగ్గరొచ్చి, ''చూడు బాబూ! నేనొక మాట చెప్తాను. ఏమీ అనుకోవుకదా!'' అన్నాడు.

మోహన్రావు ఆయనకేసి పరిశీలనగా చూసాడు. వయసు ఇంచుమించుగా డెబ్బై ఏళ్లు ఉండవచ్చు. మనిషి తెల్లగా, మంచి ఒడ్డూ పొడుగుతో ఉన్నాడు. నుదుటిమీద, మధ్యలో కుంకుమ అద్దిన గంధపు బొట్టు, నెరసిన జుట్టు, జీవితానుభవాన్ని సూచించే కళ్లు, వయోభారం వల్ల మనిషి కొద్దిగా ఒంగినట్లు కన్పిస్తున్నా, ముఖంలో ఏదో తేజస్సు. చూడగానే గౌరవభావం కలిగించేలా ఉన్న రూపం. 'సరే, చెప్పమన్నట్లు' చూసాడు మోహనరావు.

''శ్రద్ధావాన్ లభ్యతే విద్యా'' అన్నారు పెద్దలు. అంటే భక్తి శ్రద్ధలతో నేర్చుకొన్నవాడికే విద్య లభిస్తుందని దీని అర్థం. భారతీయ సంస్కృతి ప్రకారం సరస్వతీదేవిని మనం చదువుల తల్లిగా పూజిస్తాం. గురువును ఆ సరస్వతీదేవికి మరో రూపంగా గౌరవిస్తాం. పూర్వం రాజుల కాలంలో మన దేశంలో గురుకులాలు ఉండేవి. సామాన్య విద్యార్థులైనా, రాజకుమారులైనా ఎవరైనా అక్కడసమానమే. గురుశుశ్రూష చేసి, గురువు అనుగ్రహం సంపాదించి విద్య పొందవలసిందే. ఆ రాజులు, ఆ రోజులు గడచిపోయినా, ఇంచుమించు ఒక పాతిక సంవత్సరాల క్రితం వరకు మనసంఘంలో ఉపాధ్యాయుడికి గౌరవస్థానమే ఉండేది. ఉపాధ్యాయుడిని ''పంతులుగారు'' అని గౌరవంగా సంబోధించేవారు.

''పంతులుగారూ! ఎలాగైనా మీరే మా-వాడిని దారిలోపెట్టి, విద్యాబుద్ధులు నేర్పించి, ప్రయోజకుడిని చేయాలి. తిట్టినా కొట్టినా ఇక మీ ఇష్టం.. మీచేతిలో పెట్టాం. మరి ఇక మీదే భారం.'' అంటూ అల్లరిచిల్లరిగా తిరిగేపిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల కాళ్లు పట్టుకొన్న సందర్భాలు ఉండేవి. కానీ ఆ కాలం మారిపోయింది. ఉపాధ్యాయులే ఇంటింటికీ వెళ్లి ''మీ పిల్లల్ని మాస్కూల్లో చేర్పండి'' అని బతిమాలుకుంటూ తల్లిదండ్రుల చేతులు పట్టుకుంటున్నరోజులివి. దీనికి కారణం విద్య వ్యాపారంగా మారటమే పుట్టగొడుగుల్లా అనేక విద్యాసంస్థలు పుట్టుకొస్తున్న రోజులివి. ''మేముగొప్ప'' అంటే ''మేముగొప్ప'' అంటూ పిల్లలని, వారితల్లిదండ్రులను ఆకర్షించడానికి విద్యాసంస్థలన్నీ ప్రయత్నిస్తున్నాయి. పైగా ఈ రోజుల్లో పిల్లలు విద్యనభ్యసించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. నువ్వే దిక్కంటూ ఉపాధ్యాయుడినే ఆశ్రయించవలసిన అవసరం లేదు. రేడియో, టి.వి., ఇంటర్నెట్, సి.డి.లు ఇవన్నీ కూడా వాళ్లకు కావల్సిన విద్యనందిస్తున్నాయి. కరస్పాండెన్స్ కోర్సులు, డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఓపెన్ యూనివర్శిటీలు వంటివి ఉండనే ఉన్నాయి. ఇన్ని మార్గాలలో వారికి విద్యలభిస్తుంటే ఉపాధ్యాయుడంటే వారికింక లెక్కేం ఉంటుంది చెప్పు? ఇది కంప్యూటర్ యుగం. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా సాఫ్ట్‌వేర్ రంగం దేశాన్నంతా ఆక్రమిస్తున్న ఈ సమయంలో ''నానాటికీ తీసికట్టు నాగంభట్లు'' అన్నట్లుగా ఉన్న మన ఉపాధ్యాయవృత్తి గౌరవాన్ని నీ మొబైల్ స్కూలు ప్రయోగం ద్వారా ఇంకా దిగజారుస్తున్నావేమో ఒక్కసారి ఆలోచించు నాయనా'' అంటూ ఆ రిటైర్డ్ హెడ్ మాస్టర్ అంటూంటే మోహనరావుకి ఒక్కసారిగా జ్ఞానోదయం అయ్యింది. పసుపు పచ్చటి వ్యాన్‌మీద ఎర్రటి రంగులో మెరుస్తున్న ''మోహనరావు మొబైల్ స్కూలు'' అన్న అక్షరాల వంక దిగులుగా చూసాడు మోహనరావు. ఓదార్పుగా అతని భుజాల చుట్టూ చెయ్యివేసారు హెడ్మాస్టరుగారు.

★

